నేడు తిరుపతి జిల్లాలో ఫైనాన్స్ కమిషన్ పర్యటన

తిరుపతి బ్యూరో : రెండు రోజుల పర్యటన నిమిత్తం జిల్లాకు విచ్చేయనున్న16వ ఫైనాన్స్ కమిషన్ గురు, శుక్రవారాల్లో తిరుపతి జిల్లాలో పర్యటించనుందని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కమిషన్ ఛైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా, 15 మందిసభ్యులతో కలిసి 17వ తేదీ ఉదయం విజయవాడ నుంచి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని 11.30 గంటలకు తాజ్ హోటల్‌కు చేరుకుంటారు. అనంతరం కలెక్టరేట్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుని గ్రామీణ స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశం అవుతారు. అనంతరం తిరుమల చేరుకుని 18వ తేదీ ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం ఢిల్లీకి తిరుగు ప్రయాణం అవుతారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ జెసి శుభం బన్సల్ తో కలిసి సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

విలేజ్ క్లినిక్‌కు గ్రహణం

ఆ గ్రామంలో ఉన్న విలేజ్ క్లినిక్‌కి గ్రహణం పట్టింది. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం భారిన పడితే ప్రైవేట్ వైద్యులు దగ్గరకు పరుగులు పెట్టాల్సిందే.. అసలు ఆ పంచాయతీలో ఓ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఉందన్న విషయాన్నే ప్రజలు మరచిపోయారంటే అక్కడి వైద్యశాల పరిస్థితి ఏమిటో ఇటే అర్థమవుతోంది.. గ్రామీణ ప్రజలందరికీ వైద్యం అందుబాటులో ఉండాలని గత ప్రభుత్వం విలేక్ క్లినిక్‌ను నిర్మించింది. అన్ని పనులన్నీ పూర్తి చేశారు కూడా అయితే అక్కడి వైద్యాధికారుల నిర్లక్ష్యంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉపయోగంలోకి తీసుకురాకపోవడంతో ముళ్లపొదల్లో నిరుపయోగంగా ఉండిపోయింది.

కొమరగుంట గ్రామంలోని విలేజ్ క్లినిక్ చుట్టూ దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు

- ప్రజలకు అందని ప్రభుత్వ వైద్యం
- నిర్లక్ష్యం వీడాలంటున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం

గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో కొమరగుంట గ్రామంలో దాదాపు 150 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇక్కడి ప్రజలు ఎక్కువగా వ్యవసాయం, ఇతర చిన్నచిన్న పనులు చేసుకుని జీవించేవారే. గ్రామంలో వైద్యం అందుబాటులో లేకపోవడంతో చిన్నపాటి జర్వం వచ్చినా పచ్చికాపల్లంలోని ఆర్ఎంపిల వద్దకు, ప్రైవేట్ వైద్యులకు పరుగులు పెట్టాల్సిందే. పంచాయతీలో విలేజ్ క్లినిక్‌ను గత ప్రభుత్వం నిర్మించింది. నిర్మాణం పూర్తయింది ఇకపై ఇక్కడే వైద్యం అందుతుందని పంచాయతీ ప్రజలు సంతోషించారు. గ్రామంలో వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఆనందపడ్డారు. అయితే పనులు అయ్యి ఉపయోగించుకోవడానికి సిద్ధంగా ఉన్న విలేజ్ క్లినిక్‌ను ఎందుకో నిరుపయోగంగా అలానే వదిలి పెట్టేశారు. దీంతో చుట్టుపక్కల పిచ్చమొక్కలు ఏపుగా పెరిగి మనుషులు వెళ్లిలేని దుస్థితికి చేరుకుంది. ప్రభుత్వ నిధులు వెచ్చించి కట్టించిన క్లినిక్‌ను ఇకనైనా శుభ్రం చేయించి వైద్యులు, సిబ్బందిని నియమించి ప్రజలకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. ఏపాటి చిన్న జబ్బు చేసినా పచ్చికాపలంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తోందని, సంపాదించిన అంతంత మాత్రం డబ్బును ప్రైవేట్ ఆసుపత్రిలో దారపోస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా జిల్లా వైద్యాధికారులు నిర్లక్ష్యం వీడాలని గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

జర్వం వచ్చినా పచ్చికాపల్లంకి వెళ్లాల్సిందే..

- రాజేంద్ర, కొమరగుంట గ్రామస్తుడు

మా గ్రామంలో సుమారుగా 150 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. ఎవరికైనా ఏదైనా అనారోగ్యం చేస్తే పచ్చికాపలానికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి. అక్కడ ఉన్న ఆర్ఎంపీలకు డబ్బులు చెల్లించి వైద్యం చేసుకుంటున్నారు. ప్రభుత్వం విలేజ్ క్లినిక్ నిర్మించినప్పటికీ అక్కడ వైద్యసేవలు అందలేదు. స్పందించి ఈ క్లినిక్‌ను ఉపయోగంలోకి తేవాలి. ఆ క్లినిక్‌ను శుభ్రం చేసి స్థానికులకు అందుబాటులో తేవడం వలన గ్రామస్తులకు వైద్యం అందుతుంది.

అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తాం...

- హేమ శ్రీ, పచ్చికాపల్లం పిహెచ్‌సి వైద్యాధికారిణి

కొమరగుంట గ్రామంలో ఉన్న విలేజ్ క్లినిక్ అన్ని పనులు పూర్తయ్యాయి. ఒక కరెంట్ వర్క్ మాత్రం మిగిలి ఉంది. పై స్థాయి అధికారులకు తెలియజేసి వీలైనంత త్వరగా ప్రజలకు విలేజ్ క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో.. పేదలే సమిధలు

2024లో కుటుంబం ఆత్మహత్యాయత్నం
తాజాగా చిత్తూరులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కొడుకు 'ఆన్‌లైన్' బెట్టింగ్‌లతో లక్షల్లో అప్పులపాలైన ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు నియోజకవర్గంలో 2024, అక్టోబర్ 5న సంచలనం కలిగించింది. డబ్బు విషయమై కుటుంబంలోని నలుగురు గొడవపడి, పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తండ్రి నాగరాజురెడ్డి (61), తల్లి జయంతి (54), కొడుకు దినేష్ (23), కుమార్తె సునీత బలవన్మరణం చెందారు. కుటుంబం కుటుంబమే లేకుండా పోయింది. కొడుకు దినేష్ బిటెక్ చదువుతూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వ్యసనంగా మార్చుకున్నాడు. తండ్రికి ఆస్తి పంపకాల్లో వచ్చిన రూ.20 లక్షలనూ బెట్టింగ్‌లో పెట్టాడు. డబ్బుల విషయమై గొడవపడి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని మృతిచెందారు. ఆన్‌లైన్ బెట్టింగుల్లో రూ.20 లక్షలు అప్పుల పాలయ్యారని సిఐ లక్ష్మీనారాయణ అప్పట్లో కేసు నమోదు చేశారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో 20 లక్షలు పోగొట్టుకుని 2024, అక్టోబర్ 5న కుటుంబం మొత్తం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జీడీనెల్లూరు మండలంలో చోటు చేసుకుంది. నలుగురు మృతిచెందారు.

చిత్తూరులో భార్య నగలు తాకట్టు పెట్టి మరీ...

చిత్తూరు జిల్లా ఎస్‌పి విఎన్ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌పై పోలీసు శాఖ నిఘా పెంచింది. క్రికెట్, క్రీడలు, లాటరీలు, కార్డ్‌గేమ్స్ పేరిట నడుస్తున్న ఈ బెట్టింగ్ యాప్స్ కోట్లాది రూపాయల అక్రమ లావాదేవీలకు మార్గం అవుతున్నాయి. మంగళవారం చిత్తూరు పట్టణంలోని సంతపేట ప్రాంతంలో 7.30 గంటలకు చిత్తూరు పట్టణానికి చెందిన నలుగురు యువకులు క్రికెట్ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్‌పి ఆదేశాల మేరకు టుటౌన్ పట్టణ ఇన్‌స్పెక్టర్ నెట్టికంటయ్య, సిబ్బంది కలిసి నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 48వేల రూపాయల నగదు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎ1 ఎం.రాజాను విచారించగా 'దఫాబెట్ స్పోర్ట్స్' అనే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా భారీగా డబ్బులు నష్టపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. కొన్ని రోజుల క్రితం ఈ యాప్‌లో ఖాతా ఓపెన్ చేసి చిన్న మొత్తాల్లో బెట్టింగ్ పెట్టేవాడు. కొన్ని సందర్భాల్లో చిన్న చిన్న లాభాలు వచ్చాయి. ఆ లాభాలను చూసి ఇంకా ఎక్కువ డబ్బు పెట్టానే ఆశతో భార్య బంగారు ఆభరణాలను బ్యాంకులో తాకట్టు పెట్టి బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా, స్నేహితుల వద్ద నుంచి కూడా లక్షల రూపాయల వరకు అప్పు తీసుకుని ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టి నష్టాలపాలయ్యాడు. వారం రోజుల్లోనే దాదాపు ఐదు నుంచి ఆరు లక్షల రూపాయల వరకు నష్టపోయారు. సంతపేటలోని ఎం.రాజా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇ.దస్తగిరి చికెన్‌షాపు నిర్వహిస్తున్నాడు. కె.సర్ఫుద్దీన్, ఇస్మామిల్ ఓబనపల్లి కాలనీ వాసులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరంతా పేదలే కావడం గమనార్హం.

బెట్టింగ్ యాప్‌లు.. మాయాజాలం : ఎస్పీ

బెట్టింగ్ యాప్‌లు లాభాలు చూపించే మాయాజాలం మాత్రమే. ఈ బెట్టింగ్ ఆటల వలన ఆత్మహత్యలు, కుటుంబ విబేధాలు, నేరప్రవృత్తి పెరుగుతున్నాయి. 2024, అక్టోబర్ నెలలో చిత్తూరు జిల్లా జీడీనెల్లూరు మండలానికి చెందిన దినేష్ అనే యువకుడు బెట్టింగ్‌కు బానిసయ్యాడు. పెద్దమొత్తంలో అప్పుచేసి కుటుంబ ఆస్తిని తాకట్టు పెట్టాడు. చివరకు ఆర్థిక ఒత్తిడికి లోనయిన తండ్రి, తల్లి, అక్కతో కలిసి పురుగుల మందు తాగి మృతిచెందారు. ఎవరైనా బెట్టింగ్ చేయాలంటూ డబ్బులు అడిగితే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు లేదా 112, చిత్తూరు పోలీసు వాట్సాప్ నంబర్ 9440900005 కు సమాచారం ఇవ్వండి.

ద్రావిడ విశ్వవిద్యాలయంకు ఐఎస్ఓ గుర్తింపు

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం మూడు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రమాణాలకు ఐఎస్ఓ సర్వేలెన్స్ సర్టిఫికేషన్లను సాధించడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుందని, మూడు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఐఎస్ఓ సర్వైలెన్స్ ధృవీకరణలను పొందిందని ఈ విజయాన్ని ఉపకులపతి, ప్రొఫెసర్ దొరస్వామి అధికారికంగా ప్రకటించారు. సంస్థాగత ఉత్కృష్టతను నిలబెట్టడంలో విశ్వవిద్యాలయ సభ్యుల నిబద్ధతకు అభినందనలు తెలిపారు. విశ్వవిద్యాలయం నిర్వహణను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో విభాగాల కృషిని వారు ప్రశంసించారు. ప్రొఫెసర్ దొరస్వామి మాట్లాడుతూ ఈ సర్టిఫికేషన్లు విద్యా నాణ్యత, పర్యావరణ బాధ్యత, శక్తి సామర్థ్యం పట్ల విశ్వవిద్యాలయం అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఈ గుర్తింపు పొందిన సర్టిఫికేషన్ సంస్థల ద్వారా కఠినమైన సర్వేలెన్స్ ఆడిట్ తర్వాత ఈ సర్టిఫికేషన్లు మంజూరు చేయబడ్డాయని, ఇందులో విశ్వవిద్యాలయం వ్యవస్థలు, మౌలిక సదుపాయాలు, కార్యనిర్వహణ పద్ధతులు మూల్యాంకనం చేయబడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్, అకాడెమిక్ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ కె. శ్యామల, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ జయలలిత పాల్గొన్నారు.

మండల అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే థామస్

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: ఎస్ఆర్‌పురం మండలం తన సొంత మండలమని, అభివృద్ధియే ధ్యేయంగా పనిచేస్తానని డాక్టర్ విఎం థామస్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యేకు నిరంజన్‌రెడ్డి ఘన స్వాగతం పలుకగా మండలంలోని 52 కనికాపురంలో రూ.74 లక్షలతో నూతనంగా నిర్మించిన బిటిరోడ్డును ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రజాసమస్యల పరిష్కారంలో భాగాంగా బీటీ రోడ్డును ప్రారంభించామని అన్నారు. జంగాలపల్లి -తిరుపతి బస్సు సర్వీస్ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రావాలని స్థానికులు కోరడంతో పుత్తూరు డిపో డిఎంతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అలాగే ముస్లింల వివాహం కోసం షాదీ మహల్ మంజూరు చేయాలని ముస్లిం మహిళలు సోదరులు కోరడంతో కలెక్టర్‌తో మాట్లాడి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, గంధమనేని రాజశేఖర్ నాయుడు, రాజేంద్రన్, పొన్న యుగంధర్, తహశీల్దార్ లోకనాథ పిల్లై, ఎంపీడీవో మోహన్ మురళి, కార్వేటి నగర్ సిఐ హనుమంతప్ప, ఎస్సై సుమన్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: తవణంపల్లి మండలం తొడతర గ్రామంలో బుధవారం ఏరువాక సమన్వయకర్త డాక్టర్ సంధ్యారాణి, ఏఓ ప్రవీణ్ చిరుధాన్యాల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమైన పంట రాగిలోని రకాలు అధిక దిగుబడి, సస్యరక్షణ చర్యలు, విత్తన శుద్ధి గురించి రైతులకు వివరించారు. చిరుధాన్యాలు, ఐరన్, జింక, విటమిన్లు ఉండటం వలన పోషకహారమని తెలిపారు. రసాయన ఎరువులు వాడటం తగ్గించి సమగ్ర ఎరువులు యాజమాన్య పద్ధతులు వాడడం వలన భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా పంటలు అధిక దిగుబడి వస్తుందని సూచించారు. అనంతరం రైతులకు అధిక దిగుబడి ఇచ్చే రాగి రకం విత్తనాలను కలుపు మందులను వేపగింజల కషాయంను రైతులకు పంపిణీ చేశారు.

సిహెచ్‌సి, పిహెచ్‌సిలకు నిధులు పెంచాలి: కలెక్టర్

జిల్లాలోని 10 శాఖలతో శాసనసభ అంచనాల కమిటీ సమీక్షా సమావేశం

జిల్లాలోని 10 శాఖల రివ్యూ మీటింగ్లో మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో శాసనసభ అంచనాల కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిస్తామని ఆంధ్రప్రదేశ్ శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్ జోగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు, ఎంఎల్ఎలు భూమా అఖిల ప్రియ, నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, పార్థసారధి వాల్మీకి, పాశిం సునీల్ కుమార్, ఏలూరి సాంబ శివరావు, ఎమ్మెల్సీలు వరాహ వెంకట సూర్యనారాయణ రాజు, వరుదు కళ్యాణిలతోపాటు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు. కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా సమావేశంలో భాగంగా సూచించిన అంశాలు అన్నింటినీ అధికారులు తప్పక పాటించాలన్నారు. అంచనాల కమిటీ సమీక్షకు శాఖల వారీగా నివేదించే నివేదికలను పూర్తి సమాచారంతో కమిటీకి సమర్పించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులు కింద కేటాయించే నిధులలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ఉద్యానవనశాఖ ద్వారా ఎక్కువగా మామిడి, టమాట, పూల సాగు ఉందని, ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ శాఖకు సంబంధించి ఏరియా ఆసుపత్రులు, సిహెచ్‌సిలు, పిహెచ్‌సిలలో ప్రస్తుతం కేటాయిస్తున్న నిధులను పెంచాలని కలెక్టర్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. మిషన్ వాత్సల్య కింద అందిస్తున్న నగదు మొత్తాన్ని పెంచాలని కోరారు. అలాగే చైల్డ్ ప్రొటెక్షన్, బాలికా విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని తెలిపారు. కమిటీ సభ్యులు పార్థసారధి వాల్మీకి మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధుల కింద కేటాయించిన నిధులలో తాగునీటికి, విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తద్వారా ప్రజా సంక్షేమం ఏర్పడే దిశగా ఉంటుందన్నారు. పిఆర్, ఆర్ డబ్ల్యు ఎస్, ఆర్ అండ్ బి శాఖలకు సంబంధించి గతంలో కేటాయించిన పనులను నియోజకవర్గాల వారీగా మంజూరు చేసిన పనుల జాబితాను కమిటీకి సమర్పించాలన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నదని తెలిపారు. మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ గతంలో మంజూరు చేసిన పనులలో ఇంకా పనులను పూర్తి చేయకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి నిధుల కేటాయింపులో ప్రయారిటీ వారిగా నివేదికను అందజేయాలన్నారు. భూమా అఖిలప్రియ మాట్లాడుతూ గతంలో చేసిన పనులకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లను సమర్పించాలని శాఖల వారీగా గణాంకలతో వివరాలు కాకుండా పథకాల వారీగా మంజూరైన నిధులు, ఖర్చు చేసిన నిధులకు సంబంధించి నివేదికను అందజేయాలన్నారు. పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వశాఖల ద్వారా అమలయ్యే పథకాల కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన కేటాయింపులకు సంబంధించి నివేదికను అందజేయాలన్నారు. నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించి 2019-20 ఇప్పటి వరకు ప్రభుత్వం కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని తెలిపారు. వరాహ వెంకట సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో పాముకాటుకు మందుతో పాటు, కుక్క కాటుకు అవసరమైన మందులను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. వరుదు కళ్యాణి మాట్లాడుతూ శాసనసభ అంచనాల కమిటీ సమీక్షలో భాగంగా వివిధ శాఖలకు కేటాయించిన నిధులు ఖర్చు చేసిన అంశాలపై గత పది సంవత్సరాల కాలవ్యవధిలో సమీక్షించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఫోక్సో కేసుల్లోని బాధితులకు వారి పిల్లల సంరక్షణ సంబంధిత అంశాలపై ఐసిడిఎస్ అధికారులను వివరణ కోరారు. కమిటీ సభ్యులు సూచించిన అంశాలు అన్నింటికి అధికారులు శాఖల వారీగా వివరించారు. ఈ సమావేశంలో అసెంబ్లీ పద్దుల కమిటీ డిప్యూటీ సెక్రటరీ ఎస్.రాజకుమార్, డిఆర్ఓ మోహన్ కుమార్, జిల్లా అధికారులు సత్యనారాయణ, చంద్ర శేఖర్ రెడ్డి, విజయ్ కుమార్, జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపిసి వెంకట రమణ, డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి, వ్యవసాయ, ఉద్యాన, ఏపీఎంఐపి, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, ఆరిఫ్, బాలసుబ్రమణ్యం, హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ పద్మాంజలి, జిల్లా సాంఘిక, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు చెన్నయ్య, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎస్పీ తనిఖీలు

కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పట్టణంలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, సందర్శించి పనితీరును పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా చిత్తూరు ప్రజలకు 24/7 రక్షణ అందించడమే చిత్తూరు జిల్లా పోలీసుల దృఢ సంకల్పం, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ కోసం అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను జిల్లా ఎస్పీ బుధవారం సందర్శించారు. సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నియంత్రణ వ్యవస్థ, ట్రాఫిక్ మానిటరింగ్ వ్యవస్థ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ మెకానిజం వంటి అంశాలను పరిశీలించారు. సెంటర్ నెట్‌వర్క్‌కు అనుసంధానించబడిన నగరంలోని ముఖ్య కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాల దృశ్యాలను లైవ్‌గా పరిశీలించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్‌లో అత్యవసర సమయంలో ఎస్ఓఎస్ సంకేతం ద్వారా ఫిర్యాదులు అందిన వెంటనే కంట్రోల్ సెంటర్ సిబ్బంది పనితీరును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శక్తి యాప్‌లో అందించే ఎస్ఓఎస్ సంకేతం, మహిళలు, బాలికలకు రక్షణ కవచంగా పరిగణించవచ్చు. ఎస్ఓఎస్ సంకేతం అందగానే, సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం చేరి, మహిళలు లేదా బాలికలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పనిచేసే సిబ్బంది, డయల్ 112 సిబ్బంది, గస్తీ వాహన సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి కాల్ కూడా ఒక ప్రాణాంతక పరిస్థితిని సూచించవచ్చని చెప్పారు. బాధితులకు తక్షణ సహాయం అందించడం, నేరాలను అరికట్టడం, ప్రజలలో భద్రత పట్ల నమ్మకం పెంచడం అనేది ముఖ్యమైన లక్ష్యం. ప్రతి క్షణం విలువైనదిగా భావించి, 112 కాల్స్‌కు సరైన సమాధానం ఇవ్వడం, పెట్రోలింగ్ వాహనాలు వేగంగా సంఘటన స్థలానికి చేరుకోవడం, పోలీసుల బాధ్యతని ఎస్పీ తెలిపారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఎస్ఐ సహదేవి, కమ్యూనికేషన్ ఎస్ఐ భరత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీడబ్ల్యుజేఎఫ్ కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కుప్పం నియోజకవర్గ ఎన్నికలు బుధవారం జిల్లా రాష్ట్ర నాయకత్వ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ద్వారా ప్రతి విలేకరికి సంక్షేమం కొరకు అన్ని విధాల యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. అదే విధంగా ఈనెల 22వ తేదీ చిత్తూరు జిల్లాలో నాలుగవ మహాసభలు ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, ప్రతి జర్నలిస్టు పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కుప్పం నియోజకవర్గ ఏపీడబ్ల్యూజేఎఫ్ గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాసులు, అధ్యక్షులుగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం (ప్రజాశక్తి), వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, లెనిన్, గోపి, సహాయ కార్యదర్శులుగా శంకర్ మోహన్, రామచంద్ర, కలీం, కోశాధికారిగా శివను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు ప్రకాష్, జనరల్ సెక్రటరీ సలీం బాషా, ఏపీ బిజెప ప్రెసిడెంట్ చెల్లా జయచంద్ర, రాష్ట్ర లీడర్ జయరాజ్, కార్యనిర్వాహక సభ్యులు మునిరాజు, జిల్లా ఉపాధ్యక్షులు జగన్నాథ రెడ్డి, ఇదైతుల్లా, నరేంద్ర, రవికుమార్ పాల్గొన్నారు.

72 వినతులు స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కార్యాలయం ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగ బుధవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజాసమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈసందర్భంగా వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 72 ఫిర్యాదులు అందగా వీటిని సంబంధిత శాఖల అధికారులకు పంపారు. పీజీఆర్ఎస్ ద్వారా అందిన ప్రతి సమస్యపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలని, సంబంధిత నివేదికలను సకాలంలో సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ లోకేశ్వరీ, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నటుడు సప్తగిరి ప్రసాద్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సినీ నటుడు సప్తగిరి ప్రసాద్‌ను బుధవారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పరామర్శించారు. సప్తగిరి ప్రసాద్ తల్లి చిట్టెమ్మ ఇటీవల మృతి చెందారు. తిరుపతిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన కర్మక్రియల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కేంద్రం టీం సందర్శన

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామపంచాయతీలో జలజీవన మిషన్ ద్వారా చేపట్టిన పనులను కేంద్ర ప్రభుత్వ నేషనల్ వాష్ నిపుణులు పి.అంబజహగాన్ బుధవారం తనిఖీ చేశారు. కార్వేటినగరం పెద్ద హరిజనవాడలో జలజీవన్ కింద చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలించారు. అనంతరం పి.అంబజహగాన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు. పెద్ద హరిజనవాడలో ఫీల్డ్ అసిస్టెంట్లు కిట్టు ద్వారా నీటి నాణ్యతను పరిశీలించి సంతృప్తి తెలియజేశారు. స్థానిక అధికారులు ఎడబ్ల్యుఎస్‌సి కమిటీ సభ్యుల పనులు నాణ్యతను పనుల పురోగతి పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేంద్ర కుమార్, డిప్యూటీ ఇంజనీర్ ఆర్.సతీష్ కుమార్, ఏఈఈ గిరీష్ కుమార్, సర్పంచ్ ఎం.ధనంజయ వర్మ, ఈపిఓపిఆర్డి నాగరత్నమ్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఆర్డబ్ల్యూఎస్ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి- రొంపిచెర్ల: పులిచెర్ల మండలంలో బుధవారం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఈశ్వర మహేంద్ర ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 'మీ పిల్లల్ని చేర్పించండి వారు భవితకు బాటలు వేయండి' అనే నినాదంతో మండల విద్యాశాఖ అధికారులు సి.సిద్ధరామయ్య, పి.తాతయ్య యుటిఎఫ్ వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఈశ్వర మహేంద్ర మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి సమాజ మార్పునకు పునాదులు ప్రభుత్వ పాఠశాలలోనే పడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులు చక్కని సదుపాయాలతో ఆధునిక పద్ధతులలో పిల్లల శారీరక మానసిక వికాసానికి దోహదపడే నిలయాలన్నారు. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని నాణ్యమైన ఒత్తిడి లేని విద్యావిధానం ద్వారా మీ పిల్లల సర్వతో ముఖాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడాలని అన్నారు. పులిచర్ల క్లస్టర్ హెడ్మాస్టర్ సయ్యద్ షావలి, మండల గౌరవాధ్యక్షులు నాం కే నాయక్, కోశాధికారి మహమ్మద్ రఫీ, కామేశ్వర, జయప్రకాశ్ రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మండల అభివృద్ధి అధికారి బాలాజీ, పంచాయతీ విస్తరణ అధికారి శారదాదేవి పరిశీలించారు. ఈసందర్భంగా బుధవారం శంకర్రాయలపేట, శివాడి గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులను తనిఖీ చేశారు. శంకర్రాయలపేట సచివాలయాన్ని ఎంపీడీవో బాలాజీ శారదా దేవి తనిఖీ చేశారు. పంచాయతీలో చేపడుతున్న కార్యక్రమాలను ఎంపీడీవో బాలాజీ, శంకర్రాయలపేట, శివాడి గ్రామపంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలను పంచాయతీ విస్తరణ అధికారి శారదాదేవి తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పంచాయతీలలో పంచాయతీ సర్పంచులు, ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలను చేపట్టాలని పంచాయతీ విస్తరణ అధికారి గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

మనమిత్ర యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మన మిత్ర యాప్ గురించి కుటుంబంలోని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని ఎంపీడీవో బాలాజీ సచివాలయం ఉద్యోగస్తులకు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపిడిఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర యాప్ ద్వారా అందజేస్తున్న సర్వీసుల గురించి ప్రజలందరికీ అవగాహన కల్పించాలని, సచివాలయ ఉద్యోగస్తులు ప్రత్యేకంగా తయారుచేసిన కరపత్రాన్ని ప్రజలకు అందజేసి వారికి అంతర్జాలంలో సర్వీస్‌లను వాట్సాప్ ద్వారా పొందే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఆన్లైన్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎంపీడీవో బాలాజీ, పంచాయతీ విస్తరణ అధికారి శారదా దేవి, మండల ప్రజా పరిషత్ పరిపాలన అధికారి భాస్కర్ నిర్వహించారు.

కందుకూరికి ఘన నివాళి

ప్రజాశక్తి- గంగవరం: ప్రముఖ సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కళామందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు పైనేని తులసినాథం నాయుడు మాట్లాడుతూ వీరేశలింగం పంతులు తెలుగు పునరుద్జీవన ఉద్యమ పితామహుడిగా కీర్తి గడించారని, స్త్రీ విద్య, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించిన సంఘసంస్కర్త అని అన్నారు. ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజాన్ని హితకారిణి సమాజాన్ని స్థాపించారన్నారు. రాజశేఖర చరిత్రం, ఆంధ్ర కవులచరిత్ర, సత్యదేశా పూర్వయాత్రలు, సత్య హరిశ్చంద్ర లాంటి రచనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. సంస్థ కార్యదర్శి పుష్ప, ఆనందబాబు, సీతారామయ్య, ఎల్లంపల్లి నరేంద్రబాబు పాల్గొన్నారు.

వికలాంగులకు వీల్ ఛైర్స్ వితరణ

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్, కెసి ఆసుపత్రి యాజమాన్యం బుధవారం వికలాంగులకు ఉచితంగా వీల్ ఛైర్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన వెంకటేష్, అనారోగ్యంతో నడవలేని స్థితికి చేరుకున్న వేణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు సభ దృష్టికి వచ్చాయని తెలిపారు. వారి పరిస్థితిని గుర్తించిన కెసి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మంజునాథ్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ చైతన్య కృష్ణలు ఎనిమిది వేల రూపాయలు విలువచేసే వీల్ ఛైర్స్ వితరణగా ఇచ్చినట్టు లయన్స్ క్లబ్ సలహాదారు డాక్టర్ మహేష్ తెలిపారు. ఈ వీల్ ఛైర్స్ లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ సభ్యులు లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. దాతలకు లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ అధ్యక్షులు సోమశేఖర్ లబ్ధిదారుల తరపున ధన్యవాదాలు తెలిపారు. క్లబ్ సభ్యులు సెల్వం, వెంకటస్వామి, స్థానికులు నబి, బాబు, హరి పాల్గొన్నారు.

యాస్మీన్ కేసులో నిందితులను అరెస్టు చేయాలి

హత్య కేసుగా నమోదు చేయాలి.
ఎస్‌పికి ప్రజాసంఘాలు, సిపిఎం వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణంలో షేక్ యాస్మీన్ భాను మరణానికి సంబంధించిన కేసులో షేక్ మొహమ్మద్ లాలు, ఓ మైనర్ మీద హత్య, హత్యకు కుట్రకి సంబంధించిన సెక్షన్లు నమోదు చేయాలని, యాస్మీన్ మరణంలో తన తండ్రి షేక్ షౌకత్ ఆలీ పాత్ర గురించి చిత్తూరు పోలీసులు పారదర్శక విచారణ చేపట్టాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి జి. రోహిత్ , సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వాడ గంగరాజు, రోహిత్ మాట్లాడుతూ ఏప్రిల్ 13న యాస్మీన్ భాను అనుమానాస్పద పరిస్థితులలో మరణించిందని ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందని, కానీ మృతురాలిది హత్య అని భర్త తాళ్ళ సాయితేజ, ఇతరులు ఆరోపిస్తున్న నేపథ్యంలో మానవ హక్కుల వేదిక, సిపిఎం బృందం బుధవారం సాయితేజ, తన కుటుంబ సభ్యులు, చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ వారిని కలిసి నిజనిర్ధారణ జరిపిందని తెలిపారు. యాస్మిన్ ఆత్మహత్య చేసుకుని వుంటే ఆత్మహత్య చేసుకున్నప్పుడు శరీరంలో సంభవించే మార్పులు ఏమీ ఇక్కడా లేవని, అంతేకాక ఆమె చనిపోయిన మరుక్షణం నుండి తండ్రి అదృశ్యమయ్యారని, కనీసం ఫోను కూడా తీసుకువెళ్ళలేదని, అలాగే లాలు, మరొకరు కూడా తమ ఫోనులు తీసుకువెళ్ళకుండా అదృశ్యమయ్యారని తెలిపారు. ఒక తండ్రి తన కూతురు చనిపోతే కనీసం ఫోను కూడా తీసుకువెళ్లకుండా అదృశ్యమవుతారా? ఇది అనేక అనుమానాలకు తావిస్తున్నదని ఇక్కడ అనేక ప్రశ్నలు ఉన్నాయన్నారు. పోలీసుల విచారణ కూడా నెమ్మదిగా ఉందని, ఈ కేసుకు సంబంధించి రెండు వర్గాలు కూడా అణగారిన వర్గాలే అయినా ఈ విషయాన్ని అడ్డుపెట్టుకుని, సమస్యలు సృష్టించాలని అనుకువే ఇంకొక వర్గం ఉందని, అటువంటి వారికి అవకాశం ఇవ్వకుండా ఉండటానికి, యాస్మీన్, సాయితేజలకి న్యాయం చేకూర్చడానికి పోలీసుల విచారణ పారదర్శకంగా ఉండాలని జిల్లా ఎస్పి మణికంఠ చందోలును కోరడం జరిగిందన్నారు. మానవ హక్కుల వేదిక చిత్తూరు జిల్లా కన్వీనర్ కె. మదన శేఖర్, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వి. రాజ్ కుమార్, సీనియర్ పాత్రికేయులు ఎం. నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మురళికి ఘన సన్మానం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని తూ గుండ్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తెలుగు ఉపాధ్యాయులు కే.మురళి పదవీ విరమణ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన పాఠశాలలో విద్యార్థులకు అందించిన సేవలను కొనియాడారు. మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు శెట్టి, హెచ్ఎం రాజేంద్ర నాయుడు, టీచర్లు రాజేష్, చంద్రమ నాయుడు, జ్యోతి, సూర్య కుమారి, దేవరాజులు, దేవరాజులు, అశోక్, గుణశేఖర్ నాయుడు, హరీష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని గ్రామ పంచాయతీలలో 15రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. బుధవారం వెదురుకుప్పం, సిఆర్ కండ్రిగ గ్రామాలలో రోడ్డు పక్కనున్న చెత్తకుప్పలను, పేడ దిబ్బలను జేసీబీ యంత్రం సహాయంతో ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. మండల అభివృద్ధి అధికారి పురుషోత్తం పర్యవేక్షించి పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. అన్ని గ్రామపంచాయతీల్లో కూడా ఇదేవిధంగా పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు చేయాలని సర్పంచులను, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి మనోహర్, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు

విజయపురం మండలంలోని ఇళ్ళత్తూరు పంచాయతీలో బుధవారం పారిశుద్ధ్య పనులు జోరుగా నిర్వహించారు. ఇందులో భాగంగా జెసిబితో చెత్తా చెదారాలను, పేడ దిబ్బలను తొలగించారు. డ్రైనేజ్ దగ్గర బీచింగ్ చల్లడం అలాంటిది చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సురేంద్రకుమార్, టీడీపీ నాయకులు రమేష్ రాజు, మునిభాస్కర్రాజు, సచివాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలబడదాం : ఆర్కె రోజా

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ప్రజలకు అండగా నిలబడి పార్టీని బలోపేతం చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ ఆర్కేరోజా అన్నారు. బుధవారం తన నివాసంలోని కార్యాలయం వద్ద మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ ఇచ్చిన పదవిని బాధ్యతగా స్వీకరించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చెయ్యాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బీడీ భాస్కర్, మున్సిపల్ పార్టీ ఉపాధ్యక్షులు మునివేలు, ఏవీ పీతాంబరం, ప్రధాన కార్యదర్శులు శశికుమార్, తనికాచలం, నూర్‌మొహమ్మద్, కార్యదర్శులు లోకనాథం, మేషాక్, ధనపాల్, చంద్రన్, షణ్ముగం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -రామకుప్పం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేద ప్రజలకు వైద్యచికిత్సలు సకాలంలో అందించి మందులు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆస్పత్రిలో సదుపాయాలు, మౌలిక వసతులు పరికరాలు వంటివి అవసరమున్న తమకు తెలపాలన్నారు. రోగులను పరామర్శించి వైద్యం సేవలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, ఆనందరెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, ఆంజనేయరెడ్డి, సీతాపతి, చలపతి, కృష్ణానాయక్, చిన్నకృష్ణ, మహమ్మద్ రఫీ, జయశంకర్, విశ్వనాథ్ వెంకటాచలం పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీల బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పం మండల పరిషత్‌కు నూతనంగా ఎన్నికైన ఎంపీపీ సులోచన గుర్రప్ప, 2వ వైస్ ఎంపీపీ వెంకట్రామేగౌడు లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, రాష్ట్ర నేత డాక్టర్ సురేష్ బాబు, టిడిపి నేతలు ఎంపీపీ, వైస్ ఎంపీపీలను పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికై కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు తీసుకొచ్చి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ 2047 ముందు చూపుతో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషిచేసి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, చలపతి, చిన్నకృష్ణ, సీతాపతి, గంట్లప్ప గౌడు, నందా రెడ్డి,సుబ్బీ ,రఫీ, జయశంకర్, విశ్వనాథ్, వెంకటాచలం, బాలరాజు, వెంకటరమణ, అవినాష్, మంజునాథ్, ఆదిల్, సురేష్ పాల్గొన్నారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గ్రామాల అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని రాగిమానుపెంట పంచాయతీ దళితవాడలో సర్పంచ్ శ్రీహరి ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంక్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఏర్పడిన అనతి కాలంలోనే ప్రజాసమస్యల పరిష్కారానికి పూనుకుంటున్నదని అన్నారు. దళితవాడలో దాదాపు 27 లక్షల రూపాయలు ఖర్చుతో తాగునీటి అవసరాలకు తీర్చేందుకు ట్యాంకును నిర్మించామని, ఇదే విధంగా గ్రామానికి కావలసిన కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, ఆర్‌డబ్ల్యూ డీఈ రవి, ఇన్చార్జ్ ఎంపీడీవో శ్రీధర్, ఏఈ మనోజ్, ప్రసన్న మాజీ వైస్ ఎంపీపీ సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు క్లస్టర్ ఇంచార్జ్ ధరణి ప్రసాద్ నాయుడు ట్యాంక్ నిర్వాహకులు బాలకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోంది..

తమిళనాడు సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ.

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కేంద్రంలోని బిజెపి అనేక రకాలుగా రాష్ట్రాల హక్కులు, బాధ్యతలను హరించే విధంగా ప్రవర్తిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు ఆర్ఎస్ఎస్ భావాలన్న వ్యక్తులను గవర్నర్లుగా నియమించి ఆ రాష్ట్రాలకు సంబంధించి రాజ్యాంగబద్ధంగా సమకూరే హక్కులను భగ్నం చేసే విధంగా ప్రయత్నిస్తుందని మండిపెట్టారు. ఈ విషయంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్ణయాన్ని సిపిఐ స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తమిళనాడు అసెంబ్లీలో ఆమోదించబడిన అనేక బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ అనేక సంవత్సరాలుగా తొక్కిపెట్టడం శోచనీయమన్నారు. ఈ వ్యవహారపరంగా తమిళనాడు ముఖ్యమంత్రి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనట్లు ప్రకటించడం గొప్ప పరిణామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత జిల్లాలో అనేక సహకార సంస్థలు మూతపడ్డాయని తద్వారా అనేకమంది ఉపాధి కరువైందన్నారు. తక్షణమే మూతపడ్డ సహకార సంస్థలకు జీవం పోసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. టిటిడి పరంగా గతంలో కల్తీ నెయ్యి, ప్రస్తుతం గోశాలలో గోవుల మృతి వంటి వ్యవహారాలను రాజకీయ పార్టీలు భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నాయని ఇది చాలా బాధాకరమన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం భక్తుల మనోభావాలతో చలగాట మారడం భావ్యం కాదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, నగర కార్యదర్శి గోపి సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై ఎస్టీలకు అవగాహన

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: హక్కులు, చట్టాలపై ఎస్టీలకు అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్ భారతి అన్నారు. బుధవారం గంగాధర నెల్లూరు మండలం, కలిజవేడు పంచాయతీ కె.నాశంపల్లి ఎస్టీ కాలనీలో జిల్లా గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో గిరిజన హక్కులు - చట్టాలపై అవగాహన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలు గురించి, మీ హక్కుల గురించి అవగాహన కల్పించాలన్నదే ప్రధాన ఉద్దేశమన్నారు. రాజ్యాంగం ప్రతి ఒక్క పౌరుడికి సమానమైన హక్కులను కల్పించిందని, కుల, మత, ప్రాంత, లింగ భేదం లేకుండా అందరూ చట్టం ముందు సమానులేనని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం గురించి, మిమ్మల్ని కులవివక్ష నుండి, హింస నుండి కాపాడుతుందని ఎవరైనా మిమ్మల్ని కులం పేరుతో దూషించినా, అవమానించినా, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవచ్చునని తెలిపారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.మూర్తి, సర్పంచ్ నీలావతి, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, సిహెచ్ఓ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ సురేందర్ రెడ్డి, ఆర్ఐ ఏకాంబరం, కలిజవేడు వీఆర్వో ఫాతిమా, అంగన్వాడీ సూపర్‌వైజర్ సంగీత, పంచాయతీ కార్యదర్శి లావణ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి భారతి

ఉపాధ్యాయ లోకానికి ఆదర్శం 'కొఠారి' దంపతులు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ఉపాధ్యాయ వృత్తినే జీవితంగా భావించి ఆ వృత్తికి వన్నెతెచ్చిన కొఠారి దంపతులు ఆదర్శప్రాయులని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు కొనియాడారు. మండల పరిధిలోని సి ఎల్లాగరం, వీకోట బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయ దంపతులు డాక్టర్ కొఠారి వెంకటరత్నం, డాక్టర్ శాంతకుమారిలకు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా ప్రధానోపాధ్యాయులు దామోదర్ నాయుడు, ముఖ్యఅతిధిగా జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ దంపతులు విద్యార్థులకు విద్యను అందించడంతోపాటు 34 సంవత్సరాలనుండి అటు సాహిత్యరంగంలో ఎంతో ప్రతిభచూపి మండలానికి మంచిపేరు తీసుకొచ్చారని కొనియాడారు. పలువురు వక్తలు వీరి సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ జి.బాలసుబ్రమణ్యం తిరుపతి ఎస్వి లా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బుట్టి రామచంద్ర, చంద్రశేఖర్ జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సహదేవ నాయుడు, ప్రముఖ రచయిత్రి అరుణకుమారి, రిటైర్డ్ ఎంఈఓ ఆర్ముగం, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నదిలో రసాయన కలుషితాలు

తహశీల్దార్‌కు దళితుల వినతి

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ఇసుక పూర్తిగా తోడేయడంతో కుశస్థలి నదిలో రసాయన కలుషితాలు వెలుగు చూస్తున్నాయంటూ మండలంలోని తెరణి దళితవాడకు చెందినవారు ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు, తహసీల్దార్ ధనంజయులుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మా ప్రాంతంలోని కుశస్థలి నదిలో ఇసుక విచ్చలవిడిగా తీసేస్తున్నారని, శ్మశానాన్ని కూడా వదలడం లేదని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో ఇసుక తోడేయడంతో నదిలో ఇసుక పూర్తిగా అయిపోయి రాళ్ళు తేలిపోయిందని, డైయింగ్ నీరునదిలో వదిలేయడంతో అడుగులో పేరుకుపోయిన రసాయన వ్యర్థాలు, ఉప్పు బయటపడుతోందని వివరించారు. బావిలో నీరు అడుగంటి పోతోందన్నారు. మహిళలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి యేటిగట్టుకు వెళ్లాలన్నా భయపడే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని ఇల్లు, ప్రభుత్వ భవనాలు కట్టుకోవడానికి పెడితే వ్యాపారంగా మార్చుకొని ఇసుకను తరలించేస్తున్నారన్నారు. ఐదు మండలాలకు చెందిన వంద ట్రాక్టర్లు తెరణి ప్రాంతంలో కుశస్థలి నదిలోనే ఉందని, సమస్యను పరిష్కరించాలంటూ కోరారు.

క్రైం న్యూస్

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను నియంత్రించేందుకు చిత్తూరు జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం 15 తేదీన చిత్తూరు పట్టణంలోని సంతపేట ప్రాంతంలో పట్టణానికి చెందిన నలుగురు యువకులు ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు ఆదేశాల మేరకు 2వ పట్టణ ఇన్స్పెక్టర్ నెట్టికంటయ్య, సిబ్బంది నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.48,000లు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఏ1 ఎం.రాజాను విచారించగా ఇతను ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా భారీగా డబ్బులు నష్టపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. కొన్ని రోజుల క్రితం డాఫాబెట్ స్పోర్ట్స్ అనే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌లో ఖాతా ఓపెన్ చేసి చిన్న మొత్తాలతో బెట్టింగ్‌లు పెట్టేవాడు. కొన్ని సందర్భాల్లో చిన్న లాభాలు వచ్చాయి. ఆ లాభాలను చూసి ఇంకా ఎక్కువ డబ్బులు పెట్టాలనే ఆశతో అతని భార్య బంగారు ఆభరణాలను కూడా బ్యాంకులో తాకట్టు పెట్టి బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా అతనికి తెలిసిన స్నేహితుల వద్ద నుంచి కూడా లక్షల రూపాయల వరకు అప్పులు తీసుకుని వాటిని కూడా ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టి నష్టాల పాలయ్యాడు. గత వారం రోజులలోనే సుమారు ఐదు నుండి ఆరు లక్షల రూపాయల వరకు నష్టపోయానని తెలిపాడు. దీనిపై జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బెట్టింగ్ యాప్‌లు పూర్తిగా చట్టవిరుద్ధమైనవని, ఎవరూ వాటిలో పాల్గొనరాదని హెచ్చరించారు. అనంతరం నిందితుల వివరాలను తెలియజేశారు. పట్టణంలోని సంతపేట దొంగలబావి వీధికి చెందిన ఏ1 ఎం.రాజా, ఓబనపల్లి కాలనీ, మురార్జీ నగర్‌కు చెందిన ఈ.దస్తగిరి, కె.సర్ఫుద్దీన్, మునిలను అరెస్టు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఆటో బోల్తా- విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం : ఆటో బోల్తాపడి విద్యార్థులు గాయపడ్డ సంఘటన బుధవారం మండలంలోని పాలేరు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పాలేరుకు చెందిన ఆటో డ్రైవర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భవిత, చైతన్య పాఠశాల విద్యార్థులను పాఠశాలకు చేర్చుతుంటారు. బుధవారం మధ్యాహ్నం పాఠశాల ముగించుకుని స్వగ్రామాలకు వెళుతుండగా కొత్తపల్లి సర్వీస్ రోడ్డు నుండి పాలేరు మార్గంలో వెళు తుండగా పాలేరు సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో పాలేరుకు చెందిన జీవన్ కుమార్తె సౌమ్య, పాలమాకుల పల్లెకు చెందిన ప్రకాష్ కుమారుడు యువతేజ్‌కు తీవ్రమైన గాయాలు కాగా, చైతన్య స్కూల్ విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని పథమ చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ సవరణ చట్టం అత్యంత దుర్మార్గం

గాంధీ విగ్రహం ఎదుట ముస్లిం మైనార్టీల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డ్ బిల్లు అత్యంత దుర్మార్గమైందని, ముస్లిం మైనార్టీలపై ఉద్దేశపూర్వకంగా బిజెపి ప్రభుత్వం ఈబిల్లును తీసుకొచ్చిందని ముస్లిం మైనార్టీలు గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైసిపి ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు అను, కార్పొరేటర్ కౌసర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన ముస్లిం వ్యతిరేక బిల్లును వైసిపి ఎంపీలు వ్యతిరేకించడంతోపాటు సుప్రీం కోర్టులో సవాలు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం మోడీ తీసుకొచ్చిన దుర్మార్గమైన బిల్లుకు ఆమోదం తెలపడం దుర్మార్గమన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

ప్రజాశక్తి -రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ కృష్ణమ నాయనపల్లి గ్రామానికి చెందిన వెంకటరెడ్డి (48) మృతి చెందడంతో టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. గత మూడు నెలల క్రితం కర్ణాటక రాష్ట్రం రాజుపేట రోడ్డు జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో వెంకటరెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. బెంగళూరు ఆసుపత్రిలో వైద్యచికిత్సలు అందించారు. మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో టిడిపి నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నందారెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకటరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మరథంపై ఊరేగిన సీతారాములు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని పాలేరు గ్రామంలో బ్రహ్మరథంపై సీతారాములు గ్రామోత్సవ కార్యక్రమం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. మొదట సీత సమేత శ్రీరామ లక్ష్మణ, హనుమంతులకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని వీధుల్లో సీతారామ లక్ష్మణ హనుమంత ఉత్సవ విగ్రహాలను బ్రహ్మరథంపై ఊరేగించారు. సర్పంచ్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, లింగారెడ్డి, సదాశివరెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

ముగిసిన కొల్లాగుంట జాతర

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామంలో వెలసి ఉన్న నడివీధి గంగమ్మ జాతర బుధవారం కోలాహలంగా ముగిసింది. ఈ సందర్భంగా మహిళలు ఆనవాయితీ ప్రకారం చిత్తూరు – పుత్తూరు జాతీయ రహదారిపై వెలసి ఉన్న పడివేటమ్మ ఆలయం వద్ద పొంగళ్లు వండి పిండిదీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మంగళవారం రాత్రి కనక మేడాలమ్మకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహిళలు వెయ్యికళ్లదుత్తలు మోసి మొక్కులు తీర్చుకున్నారు.

LOST OF PASSPORT

I, KILARI GEETHANJALI aged about 59 years, Occ: Scientist R/o.31-61, Gurukuvari Gollapalli village. Thavanampalli mandal. Chittor District,AndhraPradesh-Pin no 517129, While I was travelling on 12-03-2020, from Chittoor to Chennai, I, lost my **Original Passport Bearing No.E82141816** Issued on **02-03-2004**, and expired date **01-03-2014**, If anyone found it please contact above address, or **Contact No. 9962243837**

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE(SENIOR DIVISION) CHITTOOR
H.M.O.P.NO.46 OF 2024
Between:
C.Meena ....Petitioner
And:
Thulasiram ....Respondent
NOTICE TO THE RESPONDENT
To
Thulasiram, S/o Gurunadham, aged about 33 years, Hindu, Pvt Employee, Residing at Chinna Venkatampalli Village, Y.S.Gate Post, Irala Mandal, Chittoor District,
Sir
Please take notice that the above petition filed by the petitioner seeking Decree of Divorce against the respondent and the said case is posted to **01.05.2025** for your appearance. If you fail to appear either in person or through an advocate on **01.05.2025 at 10-30 A.M** before the Principle Civil Judge(Senior Division),Chittoor The matter will be decided your absence.
Sd/-**A.MURALI MOHAN**
Advocate for Petitioner

పలమనేరు విద్యార్థినికి అవార్డు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు టీకేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థిని బి హర్షిత మంగళవారం సాయంత్రం ఏపీ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా స్టేట్ టాపర్ టీ హర్షిత షైనింగ్ స్టార్ అవార్డును తన తల్లిదండ్రులతో కలిసి అందుకున్నారు. చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం గాజులపల్లి చెందిన ఒక సాధారణ ట్రాక్టర్ డ్రైవర్ టి రవి, సాధారణ గృహిణి టి లక్ష్మమ్మ కుమార్తె టి హర్షిత పలమనేరు టీకేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులైన డైరీ సైన్స్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 1000 మార్కులకు 971 మార్కులు సాధించి స్టేట్ టాపర్ గా. నిలిచి నందుకు ప్రభుత్వం తరపున షైనింగ్ స్టార్ అవార్డు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ కన్నయ్య బుధవారం సాయంత్రం తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత హర్షిత మాట్లాడుతూ తాను మొదటి నుంచి తన తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను చూసి ఎలాగైనా కష్టపడి చదివి మంచి ఉద్యోగం సంపాదించాలనే పట్టుదలతో చదువు తున్న ట్లు, పదవ తరగతి కూడా జవహర్ నవోదయలో చదివి 440 మార్కులతో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. తన విజయానికి కారకులైన తల్లిదండ్రు లకు బంధువులకు పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందానికి, కళాశాల యాజమా న్యానికి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థిని

ఏఎంసీ ఛైర్మన్‌గా భాస్కర్ నాయుడు



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బంగారుపాలెం మార్కెట్ కమిటీ ఛైర్మన్ గా తవణంపల్లి మండలం కొండ్రాజ కాలవ గ్రామానికి చెందిన భాస్కర్ నాయుడు ఎంపిక చేసినట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈయన గతంలో తవణంపల్లి మాజీ వైస్ ఎంపీపీ గా విధులు చేపట్టి పూతలపట్టు నియోజకవర్గం లో టిడిపికి సేవలందిస్తున్నట్టు ఆయనను పార్టీ గుర్తించి ఏఎంసీ ఛైర్మన్ గా ఎంపిక చేశారని ఎంపికైన భాస్కర్ నాయుడును పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళి మోహన్ అభినందించారు.

బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ క్యాంపునకు విశేష స్పందన

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పట్టణలో బుధవారం నిర్వహించిన బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ క్యాంపులో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఇందులో 24 ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా 4 జి కవరేజ్, ఫైబర్ కనెక్షన్ గురించి ఫిర్యాదులు అందాయి. వాటిని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ క్యాంపు గురించి ప్రజలకు తెలిపి, ప్రజలను చైతన్యపరచిన విలేకరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి..

ఎమ్మెల్యేకు బాధితుల అభ్యర్థన

ప్రజాశక్తి -పలమనేరు : పలమనేరు ఫుట్ వేర్ అసోసియేషన్ సభ్యులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు బాధితులు స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిని బుధవారం కలిసి విన్నవించారు. పట్టణంలో మొత్తం 42 దుకాణాలు ఉన్నాయని అయితే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారుల వల్ల తమ తీవ్రంగా నష్టపోతున్నామని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేవారు ఫుట్ పాతులపై విక్రయిస్తుండడంతో తామ తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఇప్పటికే ఆన్లైన్ బిజినెస్ ద్వారా తమ వ్యాపారాలు 50 శాతానికి పడిపోయాయని ఇతర ప్రాంతాల వారితో పూర్తిగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అధికారులతో చర్చించి పట్టణానికి దూరంగా వారు వ్యాపారాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేషన్ రుణాలను అందించి తమను ఆదుకోవాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జగా, జాకీర్ రాఘవేంద్ర, కాలేషా పాల్గొన్నారు.

'పురమిత్ర యాప్' సేవలు సద్వినియోగం చేసుకోవాలి: కమిషనర్

ప్రజాశక్తి- పలమనేరు: కృత్రిమ మేధ (ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్సి) సాయంతో రూపొందించిన 'పురమిత్ర యాప్'లో 150 రకాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం, పురపాలిక పౌర సేవలు అందరికీ సులభతరంగా అందించేందుకు 'పురమిత్ర యాప్'ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్ ద్వారా పట్టణ ప్రజలు ఇంటిలోనే కూర్చొని పౌరసేవలను పొందే వీలు కల్పించారన్నారు. 'కృత్రిమ మేద' (ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్సి) సాయంతో రూపొందించిన ఈ యాప్ లో 150 రకాల సేవలు పొందవచ్చన్నారు. పారిశుధ్యం, నీటి సరఫరా, వీధి దీపాలు వంటి ఏ సమస్య అయినా ఈ యాప్ ద్వారా తక్షణం తీసుకెళ్లవచ్చన్నారు. పురపాలిక రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం, ఇంజనీరింగ్, అకౌంట్స్, పరిపాలనా విభాగం, జనన, మరణ ధ్రువ పత్రాలు, వివాహ ధృవీకరణ పత్రాలు, పన్ను చెల్లింపులు, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ ఇందులో పొందవచ్చని తెలిపారు. సంబంధిత సమస్య సమాచారం సంబంధిత విభాగాధికారికి చేరుతుందన్నారు. 15 నుండి 30 రోజుల గడువు లోపు ఈ సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజలు తమ మొబైల్ లలో 9552300009 నెంబరును సేవ్ చేసుకుని ఈ సేవలు పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఏప్రిల్ 15, 2025 నుండి 'ప్రతి ఇంటివద్ద మన మిత్ర" పేరుతో విస్తృత మైన ఇంటింటికి అవగాహనా ప్రధారం ప్రారంభించిందన్నారు. వార్డు సచివాలయాల సిబ్బంది అన్ని గృహాలను సందర్శిస్తారని, మన మిత్ర నెంబరును సేవ్ చేయడంలో నివాసితులకు సహాయం చేస్తారన్నారు. ఈ ఫ్లాట్ ఫాంను ఎలా ఉపయోగించాలో వివరిస్తార న్నారు. మన మిత్ర ద్వారా 250 పైగా ప్రభుత్వ సేవలు అందిస్తుందని ప్రజలు ఆధార్ లింక్డ్ మొబైల్ నెంబరు నుండి సర్టిఫికేట్లను (జనన, మరణ తదితర) డౌన్‌లోడ్ చేసు కోవచ్చని తెలిపారు. యుటిలిటి బిల్లులు విద్యుత్, నీరు, ఆస్తి పన్నులు చెల్లించవచ్చును. టికెట్-బస్సు టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు , ఇతర ప్రధాన ఆలయాలలో సహా ఆలయ సేవలను రిజర్వు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: ప్రజా సమస్యలపై నాయకులు దృష్టి సారించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు టిడిపి కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ యూనిట్ క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జిలు, ముఖ్య నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయా అనే విషయంపై నాయకులకు పూర్తి అవగాహన అవసరమన్నారు. ముఖ్యంగా రేషన్ పంపిణీలో ప్రజలు సమస్య ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని, తాగునీరు ఇబ్బందులు ఎక్కడైనా ఉంటే నాయకులు గుర్తించి వెంటనే అధికారులు దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. నిజమైన లబ్ధిదారులకు పథకాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ప్రధానంగా పార్టీకి సంబంధించిన కుటుంబ సాధికారిక సారథి, గ్రామ స్థాయి మొదలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పార్లమెంటు, అనుబంధ కమిటీల నియామకం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, రంగనాథ్, నాగరాజు రెడ్డి, సోమశేఖర్ గౌడ్, ఆనంద్, కుట్టిలతో పాటు సీనియర్ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, బ్రహ్మయ్య, సుబ్రహ్మణ్యం గౌడు, ఖాజా పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి: కడా పీడీ

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : స్థానిక అవసరాలను గుర్తించి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కడా పీడీ వికాస్ మరమ్మాత్ పురపాలక సంఘం సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్, స్థానిక టిడిపి నాయకులతో కలిసి పట్టణంలోని రెండవ వార్డు పరిధిలో పర్యటించారు. ఇందులో భాగంగా సీగలపల్లి, చిన్నశీగలపల్లి, నారాయణపురం, హనుమంత కొట్టాలు, అనుపుకొండ, మంగాపురం, కోక్కనూరు, పెద్దన్న కొటాలు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానిక అవసరాలను గుర్తించడంతో పాటు ప్రజలతో సంప్రదించి వారి అవసరాలను అడిగి తెలుసు కునే ప్రయత్నం చేశారు. పురపాలక సంఘం అధికారుల నివేదిక ప్రకారం ప్రభుత్వాలు అనుమతితో త్వరితగతిన అభివృద్ధి పను లు చేపడుతామని తెలి పారు.

మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మరమ్మాత్

మాట్లాడుతున్న టిటిడి బోర్డు సభ్యులు శాంతారామ్

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా

టిటిడి బోర్డు సభ్యులు శాంతారామ్

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : తిరుమల తిరుపతి దేవస్థానం పై మాజీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానంటూ టిటిడి బోర్డు సభ్యులు శాంతారామ్ పత్రికాముఖంగా సవాలు విసిరారు. బుధవారం కుప్పం పట్టణంలో టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం ల ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై రాష్ట్రంలో ఆరోపణలు చేయడానికి అవకాశం లేకపోవడంతో తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అడ్డుపెట్టుకుని వైసిపి ప్రభుత్వం రాజకీయం చేస్తోందంటూ ఆరోపించారు. వయసు మీరిన, అనారోగ్యంతో బాధపడుతున్న గోవులు మరణించడం సర్వసాధారణమని, వాటిని రాజకీయం చేయడం సబబు కాదన్నారు. మాజీ టిటిడి బోర్డు అధ్యక్షులు టిటిడిపై చేస్తున్న ఆరోపణలను నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని సవాలు విసిరారు.

కంటైనర్‌లో మంటలు

అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : అగ్నిమాపక అధికారులు స్పందించడంతో కుప్పం పట్టణంలో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక అధికారుల కథనం మేరకు..పలమనేరు క్రిష్ణగిరి జాతీయ రహదారి, కుప్పం బైపాస్ రోడ్డు బైరుగానిపల్లి కూడలి వద్ద ఆగి ఉన్న కంటైనర్ వాహనం నుండి మంటలు వచ్చాయని స్థానికులు తెలిపారు. వెంటనే సమాచారాన్ని స్థానిక పోలీసులకు, అగ్నిమాపక శాఖ అధికారులకు చేరవేశామన్నారు. సమాచారం అందుకున్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి అగ్నిమాపక వాహనంతో ఘటన స్థలానికి చేరుకుని అతి కష్టంపై మంటలను అదుపులోనికి తీసుకువచ్చారు. సమయానుకూలంగా రక్షణ దళాలు స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని, అంతర్రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారిపై ప్రతినిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తూ ఉంటుందని, అగ్నిప్రమాదం అదుపుతప్పి ఉంటే అందువల్ల జరిగే నష్టం ఊహించడానికి భయం వేస్తోందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి స్పందించిన పోలీసు, అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం ఈరోడ్డు ప్రాంతంలోని మిల్కీ మిస్ట్ పరిశ్రమకు చెందిన కంటైనర్ పరిశ్రమకు సంబంధించిన ఉత్పత్తులను తీసుకుని కలకత్తా వెళుతుండగా మార్గమధ్యంలోని కుప్పం ప్రాంతంలో ప్రమాదం జరిగిందని వాహన డ్రైవర్లు తెలిపారు. అగ్ని ప్రమాదం జరగడానికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి వుంది.

సమస్యలపై స్పందించండి

ఎమ్మెల్యేకు వీఆర్ఏల వినతి

ప్రజాశక్తి- పలమనేరు: వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చొరవ చూపాలని వీఆర్ఏల సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. వీఆర్ఏలపై నిబంధనలకు విరుద్ధంగా మోపిన నైట్ డ్యూటీలు, ఇసుక, రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు వెంటనే నిలిపివేయాలని కోరారు. తెలంగాణలో ఇస్తున్నట్లు వీఆర్ఏలు అందరికీ పేస్కేలు జీతాలు చెల్లించాలని, డీఏను జీవితంలో కలపాలన్నారు. గతంలో వైసిపి పాలనలో రికవరీ చేసిన డి ఏ నగదును తిరిగి చెల్లించాలని ఇంటర్మీడియట్ విద్యా అర్హతల ఆధారంగా ప్రమోషన్లు అమలు చేయాలనే డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వీఆర్ఏల సంఘ నాయకులతో పాటు, కార్మిక సంఘ నాయకులు ఓబుల్ రాజు పాల్గొన్నారు.